
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
KHAMMAM
శనివారం, 16 ఆగస్టు 2025



ర్యాక్ పాయింట్ నుంచి యూరియా పంపిణీ

చింతకాని, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతుల వ్యవసాయ అవసరాల నిమిత్తం 2638.44 టన్నుల యూరియా శుక్రవారం పందిళ్లపల్లి ర్యాక్ పాయింట్‌కు చేరిందని టెక్నికల్ ఏవో పవన్‌కుమార్ తెలిపారు. ఈ ర్యాక్ పాయింట్ నుంచి మార్క్‌ఫెడ్, ప్రైవేటు డీలర్లుకు జరిగిన యూరియా పంపిణీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఖమ్మం జిల్లాకు 1538.44, భద్రాద్రి జిల్లాకు 1000, సీఆర్‌పీ ఖమ్మానికి 100టన్నుల యూరియాను ప్రభుత్వం కేటాయించిందన్నారు.

స్వాతంత్ర్య ఫలాలు.. అన్ని వర్గాలకు అందాలి



జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- అదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులతో నిరుపేదలకు ఆసరా
- పంద్రాగస్టు వేడుకల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- ఖమ్మంలో జాతీయ జెండా ఆవిష్కరణ



పరేడ్ గ్రౌండ్‌లో చిన్నారుల సాంస్కృతిక నృత్యం

ఖమ్మం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : స్వాతంత్ర్య ఫలాలు అన్ని వర్గాలకు అందాలన్నదే తమ ప్రజాప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల మంజూరుతో ప్రతీ నిరుపేద సంక్షేమానికి కృషిచేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఖమ్మం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఆయన పోలీసు గౌరవ వందనం స్వీకరించి.. జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భట్టి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న జిల్లాకు చెందిన జమలాపురం కేశవరావు, అయితం వెంకటేశ్వర్లు, కొత్త జనార్దన్ రావు, లచ్చమ్మ, జైనాబి, కొలిపాక కృష్ణారావు, రంగయ్య నాయుడు, మహ్మద్ రజబ్ అలీ, షోయబుల్లాఖాన్, లజ్జావతి చతుర్వేది తదితరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 ఏళ్లుగా ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేద ప్రజల ఆహార భద్రతకు భరోసా ఇస్తుందని, అదే స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిందని అన్నారు. పేదల ఆత్మగౌరవానికి మరో ప్రతీక రేషన్ కార్డులను అర్హులైన పేద కుటుంబాలకు పంపిణీ చేస్తున్నామని, ఖమ్మం జిల్లాలో కొత్తగా 24 వేల 818 కుటుంబాలకు రేషన్ కార్డులు జారీ చేశామన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల వరకు రుణమాఫీ చేశామని, 3,37,898 మంది రైతుల ఖాతాల్లో రూ.427.38కోట్ల రైతు భరోసా నిధులు జమ చేశామన్నారు. పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామని, మద్దులపల్లిలో రూ.19.95కోట్లతో వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేశామని, ఖమ్మంలో రూ.155కోట్లతో మోడల్ మిర్చి మార్కెట్ నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రతీ నిరుపేదకు గూడు కల్పించే ధ్యేయంతో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఖమ్మం జిల్లాలో 16,153 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశామని, నాలుగు దశల్లో గ్రీన్‌ఛానల్ ద్వారా లబ్ధిదారులకు నేరుగా రూ.5 లక్షలు జమ చేస్తోందన్నారు. మహాలక్ష్మి పథకం కింద నేటి వరకు జిల్లా వ్యాప్తంగా 4.22కోట్లకుపైగా మంది ఉచితంగా బస్సుల్లో ప్రయాణించారని, తద్వారా వారికి రూ.198.34కోట్లపైగా ఆదా అయ్యిందన్నారు.

సాగునీరు నిరాటంకంగా...!

కృష్ణా, గోదావరి జలాల్లో మన వాటాల సాధనలో రాజీ పడబోమని, శాశ్వత హక్కుల సాధనలో విజయం సాధించేలా ప్రభుత్వం ఓ ప్రణాళికతో పని చేస్తోందన్నారు. ఎర్రుపాలెం, మధిర మండలాల్లో నాగార్జునసాగర్ జోన్ 3 లోని 33వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం 630కోట్లతో జవహర్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశామన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా 3,28,853 ఎకరాల్లో కొత్త ఆయకట్టుకు సాగునీటి వసతి కల్పించామన్నారు. రఘునాథపాలెం మండలంలో మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి 455 ఎకరాలకు కొత్త ఆయకట్టు, 1957 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ పూర్తి చేశామని, మున్నేరు నది నుంచి సీతారామ ఎత్తిపోతల పథకం లింక్ కెనాల్ పనులు రూ.107.65కోట్లతో మంజూరు చేశామని, మున్నేరు నది ఇరువైపులా రూ.525.36కోట్లతో రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, గిరిజన సంక్షేమ శాఖల ద్వారా విద్యార్థులు, ఆయా వర్గాల వారికి సంక్షేమం అందిస్తున్నామన్నారు. నేలకొండపల్లి బౌద్ధ స్తూపం, పాలేరు చెరువు, ఖమ్మం ఖిల్లా, వెలుగు మట్ల అర్బన్ పార్క్ లాంటి పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికలు తయారు చేశామన్నారు. అనంతరం ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన అమర వీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు డిప్యూటీ సీఎం, కలెక్టర్ అనుదీప్ ప్రశంసాపత్రాలు అందజేశారు. అనంతరం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎర్రుపాలెం మండలం వెంకటాపురం వనసంరక్షణ సమితి సభ్యులకు రూ.9.20లక్షల ట్రాక్టర్, రూ.10లక్షల దోస్త్ వాహనం అందజేశారు. పదో తరగతి, ఇంటర్‌లలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్ సింగ్, లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీసీపీ ప్రసాదరావు, డీఆర్వో పద్మశ్రీ, మాజీ ఎమ్మెల్సీలు పోట్ల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం ఆర్డీవో నరసింహారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైద్యానికి ప్రాధాన్యం..

నిరుపేదలకు ఆరోగ్య భద్రత కల్పించే రాజీవ్ ఆరోగ్య శ్రీ కింద 35,645మందికి రూ.93.50కోట్ల వైద్య ఖర్చులను ప్రభుత్వం చెల్లించిందన్నారు. మధిర, సత్తుపల్లి పట్టణాల్లో రూ.34 కోట్ల చొప్పున ఖర్చు చేస్తూ 100 పడకల ఆస్పత్రులు, కల్లూరులో రూ.10.50కోట్లతో 50 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్, పెనుబల్లిలో రూ.7.50కోట్లతో 30 పడకల కమ్యూనిటీ సెంటర్ నిర్మాణం పూర్తి చేశామన్నారు. పాలేరు, సత్తుపల్లి పట్టణాల్లో రూ.25 కోట్లతో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, వైరా పట్టణంలో రూ.37.50 కోట్లతో 100 పడకల ఆస్పత్రి భవనం, ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో రూ.23.50కోట్లతో 50 పడకల క్రిటికల్ కేర్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. యువత ఉద్యోగ, ఉపాధికి పెద్దపీట వేస్తున్నామని, బాధ్యతలు స్వీకరించిన మరుక్షణం టీజీపీఎస్సీని సంస్కరించామని, 20నెలల్లో దాదాపు 60వేల ఉద్యోగాలు భర్తీ చేశామని అన్నారు.



ఖమ్మం పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పక్కన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

పారిశుధ్య నిర్వహణ (స్వచ్ఛ సర్వేక్షణ్) కార్యక్రమాల్లో గతంలో జాతీయ అవార్డులు పొందిన ఇల్లెందు మునిసిపాలిటీ నాటి వైభవాన్ని కోల్పోయింది. కేంద్ర గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖలు దేశ వ్యాప్తంగా పట్టణాల్లో అమలు జరుగుతున్న స్వచ్ఛత కార్యక్రమాలు పరిశీలించి ర్యాంకులు, అవార్డులు అందజేయడం తెలిసిందే. ఈ క్రమంలో 2024 సంవత్సరంలో జాతీయ స్థాయిలో రాష్ట్రానికి వన్నెతెచ్చిన ఇల్లెందు మునిసిపాలిటీ 2025లో రాష్ట్రస్థాయిలో 93వ స్థానం, జాతీయ స్థాయిలో 927వ స్థానాలకు పడిపోవడం గమనార్హం.

ఏదీ నాటి వైభవం?

- ప్రాభవం కోల్పోయిన ఇల్లెందు మునిసిపాలిటీ
- 'స్వచ్ఛ సర్వేక్షణ్'లో ఉమ్మడి జిల్లా పురపాలికలు వెనుకబాటు



ఇల్లెందు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గతంలో ప్రజాప్రతినిధులతో కూడిన పాలక వర్గాలు ఉండటం వల్ల స్వచ్ఛసర్వేక్షణ్ కార్యక్రమాలు కట్టుదిట్టంగా అమలయ్యాయి. ప్రత్యేకించి ఇల్లెందు మున్సిపల్ ఛైర్మన్‌గా దమ్మాలపాటి వెంకటేశ్వర్‌రావు పనిచేసిన సమయంలో పారిశుధ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించడం, వాటిలో కౌన్సిలర్లు, సిబ్బందిని భాగస్వామ్యం చేయడంతో ఇల్లెందు మున్సిపాలిటీ రాష్ట్ర, జాతీయ అవార్డులకు ఎంపికైంది. కాగా ప్రజా ప్రతినిధుల పదవీకాలం 2025 జనవరిలో ముగియగా.. ఉన్నతస్థాయి అధికారులే మున్సిపాలిటీలకు స్పెషల్ ఆఫీసర్లుగా కొనసాగుతున్నారు. దీంతో ఏడునెలలుగా మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు, తాగునీటి సరఫరా తదితర అంశాల్లో ప్రజల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతుండటం గమనార్హం. కేంద్ర ప్రభుత్వ అధికారుల పరిశీలనలో స్వచ్ఛత కార్యక్రమాలు ఆశించిన రీతిలో జరగకపోవడం వివిధ ప్రామాణికాల్లో వెనుకబడిపోవడం మూలంగా ఇల్లెందు మున్సిపాలిటీ ర్యాంకులు పడిపోవడంతో ప్రాభవాన్ని కోల్పోయినట్లైంది. దమ్మాలపాటి ఛైర్మన్‌గా ఉన్న సమయంలో ఆయన పారిశుధ్య కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షించేవారు. స్వయంగా ఇళ్ల వద్దకు వెళ్లి చెత్త సేకరణను పరిశీలించేవారు. దాంతో సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ చెత్తసేకరణతో పాటు రహదారుల పక్కన పరిశుభ్రత చర్యలు చేపట్టేవారు. ఫలితంగా 2022లో ఇల్లెందు మున్సిపాలిటీ జాతీయ స్థాయిలో 18వ స్థానంలో నిలిచింది. ఇళ్ల నుంచి తడిపొడి చెత్త వేర్వేరుగా సేకరించడం, చెత్తను డంపింగ్ యార్డుకు తరలించి సేంద్రియ ఎరువులు తయారీ, క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు చేపట్టడం స్వచ్ఛ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టడం లాంటి వాటితో ఇల్లెందు జిల్లా స్థాయిలో వరుసగా మూడు సార్లు, రాష్ట్ర స్థాయిలో మూడు సార్లు, జాతీయ స్థాయిలో రెండు సార్లు ఉత్తమ మున్సిపాలిటీ అవార్డులు గెలుచుకుంది. జాతీయ స్థాయిలో చేంజ్ మేకర్స్‌గా రెండు పర్యాయాలు అవార్డులు కైవసం చేసుకుంది. అలాగే ఇల్లెందు మున్సిపాలిటీ 2021లో జోనల్ స్థాయిలో 19వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 32వ ర్యాంకు సాధించింది. ఇక 2022లో జోనల్ స్థాయిలో 18వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 26వ ర్యాంకు దక్కించుకోగా.. 2023లో జోనల్ స్థాయిలో 11వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 16వ ర్యాంకు సాధించింది. రాష్ట్రంలో 142 మున్సిపాలిటీలు ఉండగా స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాల్లో అగ్రగామిగా నిలవడంతో పట్టణ ప్రగతికి గత ప్రభుత్వం అదనపు

(మిగతా 6వ పేజీలో)

పట్టణం/నగరం	జీఎఫ్‌సీ స్టేటస్	ఓడీఎఫ్ స్టేటస్	రాష్ట్ర ర్యాంకు	జాతీయ ర్యాంకు
50వేల నుంచి 3లక్షల జనాభా				
ఖమ్మం	నిల్	++	60	373
కొత్తగూడెం	నిల్	+	65	396
పాల్వంచ	నిల్	+	49	302
20వేల నుంచి 50వేలు జనాభా				
ఇల్లెందు	నిల్	++	93	927
సత్తుపల్లి	నిల్	+	95	941
మణుగూరు	నిల్	+	103	1,032
మధిర	నిల్	+	113	1,108
వైరా	నిల్	నిల్	129	1,290



శౌర్య పతకం అందుకున్న సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో ఎంతో ధైర్య సాహసాలతో విధులు నిర్వహించినందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఖమ్మం సీపీ సునీల్‌దత్‌ను శౌర్య పతకం -2024కు ఎంపిక చేసింది. ఈ క్రమంలో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో గోల్కొండ కోటలో జరిగిన వేడుకల్లో సీఎం రేవంత్‌రెడ్డి సీపీకి ఈ పతకాన్ని బహూకరించారు.



ప్రకాష్‌నగర్ బ్రిడ్జి పైనుంచి మున్నేరును పరిశీలిస్తున్న మంత్రి

మున్నేరు వరదను పరిశీలించిన మంత్రి తుమ్మల

అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశం

ఖమ్మం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఖమ్మంలో ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరునది ప్రవాహాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఎగువున కురిసిన వర్షాలతో మున్నేరుకు వరద వచ్చినందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అకాలవర్షాలు పడితే ప్రజలకు ఇబ్బంది లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాలో 30.7మి.మీ. సగటు వర్షపాతం

ఖమ్మం జిల్లాలో శుక్రవారం ఉదయానికి 30.7మి.మీ. సగటువర్షపాతం నమోదయింది. అత్యధికంగా రఘునాథపాలెం మండలంలో 68.0మి.మీ., చింతకానిలో 67.2మి.మీ., పెనుబల్లిలో 62.4మి.మీ., బోనకల్‌లో 64.2మి.మీ. వర్షం కురిసింది. జిల్లాలో సింగరేణిలో 49.8మి.మీ., కామేపల్లి 30.8మి.మీ., ఖమ్మంరూరల్ 8.0మి.మీ., తిరుమలాయపాలెం 41.4మి.మీ., కూసుమంచి 32.6మి.మీ., నేలకొండపల్లి 32.6మి.మీ., ముదిగొండ 57.4మి.మీ., ఖమ్మంఅర్బన్ 10.4మి.మీ., కొణిజర్ల 8.4మి.మీ., ఏన్కూరు 14.4మి.మీ., కల్లూరు 41.2మి.మీ., సత్తుపల్లి 20.6మి.మీ., వేంసూరు 30.8మి.మీ., తల్లాడ 4.2మి.మీ., వైరా 13.2మి.మీ., మధిర 2.6మి.మీ. వర్షపాతం నమోదైంది.



మణుగూరు మండలం చిక్కుడుగుంటలో కొమరంభీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సీతక్క

ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తా

- బీటీపీఎస్ నిర్వాసితుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా
- కొమరంభీం విగ్రహావిష్కరణలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

6



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం

పెరుగుతున్న గోదావరి

- భద్రాచలం వద్ద 26.3 అడుగులకు చేరిన నీటిమట్టం

భద్రాచలం,ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజులుగా గోదావరి పరివాహకంలో కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. గురువారం అర్ధరాత్రి 12 గంటలకు 20.8అడుగులున్న నీటిమట్టం శుక్రవారం ఉదయం 6 గంటలకు 23.6 అడుగులకు చేరింది. 12 గంటలకు 25.4, 4గంటలకు 26.3అడుగులకు చేరగా.. రాత్రికి 28 అడుగుల వరకు చేరే అవకాశం ఉన్నట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా భద్రాచలం గోదావరి స్నానఘట్టాలపై నుంచి నీరు ప్రవహిస్తోంది. భక్తులు, పర్యాటకులకు తెలిసేందుకు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.



కొత్తగూడెం ప్రకాశం మైదానంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

ముువ్వన్నెల సంబురం

పంద్రాగస్టు సంబురం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటింది. ఖమ్మం పరేడ్ మైదానంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, భద్రాద్రి జిల్లా కేంద్రం కొత్తగూడెంలోని ప్రగతి మైదానంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పతాకావిష్కరణలు చేశారు. ఇక సింగరేణి, ఐటీడీఏతో పాటు ఇరుజిల్లాల్లోని అన్ని కార్యాలయాలు, విద్యాసంస్థల్లో మువ్వన్నెల పతాకం రెపరెపలాడింది.



జూలూరుపాడులో 450 మీటర్ల జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న వాకర్స్ క్లబ్, ఆరోగ్యజీవన యాత్ర బృందం



కొత్తగూడెంలో గౌరవ వందనం స్వీకరిస్తున్న సింగరేణి సీఎండీ



కొత్తగూడెం ప్రకాశం మైదానంలో స్వాతంత్ర్య సమరయోధులను సత్కరిస్తున్న మంత్రి తుమ్మల



ఖమ్మం పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య సమరయోధులను సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి



ఖమ్మం జడ్పీ కార్యాలయంలో పతాకావిష్కరణ చేస్తున్న కలెక్టర్ అనుదీప్



కొత్తగూడెం కలెక్టరేట్‌లో వందనం చేస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్



ఖమ్మం ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న బీఎం టి.పుల్లారావు, వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు



భద్రాచలం రామాలయ పరిపాలనా కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరిస్తున్న ఈవో రమాదేవి



భద్రాచలం ఐటీడీఏలో గౌరవవందనం స్వీకరిస్తున్న పీవో



ఖమ్మం పరేడ్ మైదానంలో జాతీయ నాయకుల వేషధారణల్లో చిన్నారులు



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో జెండావిష్కరిస్తున్న డైరెక్టర్(పా) గౌతమ్ పోట్రు

కండక్టర్ అనితకు సామాజిక సేవా అవార్డు

అందజేసిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్



ఆర్టీసీ ఎండీ సజ్జనార్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ఖమ్మం డిపో ఆర్టీసీ కండక్టర్ అనిత

ఖమ్మం ఖానాపురం హవేలి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎ.అనితకు సామాజిక సేవా విభాగంలో ఉత్తమ సేవకురాలిగా అవార్డు అందుకున్నారు. సంకల్ప స్వచ్ఛంద సంస్థను స్థాపించి సుమారు 500 మంది పిల్లలకు ప్రతీ నెల మందులు, రక్తం సేకరించి పిల్లలకు ప్రాణదానం కల్పించినందుకు గాను ఆమె ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతులమీదుగా ఆమె అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవించిన ఐటీడీఏ పీవో సతీమణి

పంద్రాగస్టు నాడే.. పండంటి బిడ్డకు జన్మనిచ్చిన మనీషా



ప్రసవం అనంతరం శిశువుతో పీవో దంపతులు, వైద్యులు, సిబ్బంది

భద్రాచలం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం ఐటీడీఏ పీవో పీవో బి రాహుల్ సతీమణి మనీషా శుక్రవారం తెల్లవారుజామున భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో ప్రసవించారు. రాహుల్ సతీమణి మనీషా గర్భం దాల్చిన నాటి నుంచి ప్రభుత్వ వైద్యుల పర్యవేక్షణలో ఉండగా.. గురువారం సాయంత్రం పురిటినొప్పులు రావడంతో ఆమెను హుటాహుటిన భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చేర్చారు. అక్కడి వైద్యులు మనీషాకు సాధారణ ప్రసవం కోసం ప్రయత్నించారు. అది సాధ్యం కాకపోవడంతో శుక్రవారం తెల్లవారుజామున సిజేరియన్ ద్వారా ఆమె పండంటి మగబిడ్డకు జన్మనిచ్చారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండగా.. ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సైదులు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య, వైద్యులు క్రాపా విజయ్ స్వాతి, శంషాద్, కౌండిన్యతో కూడిన వైద్యుల బృందం ప్రత్యేక పర్యవేక్షణలో మనీషాకు సిజేరియన్ జరిగింది. కాగా పంద్రాగస్టు రోజున తండ్రైన పీవో దంపతులకు వైద్యులు, సిబ్బంది, పలువురు అధికారులు అభినందినలు తెలిపారు. ఇదిలా ఉండగా పీవో రాహుల్ సతీమణి ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవించిన విషయం తెలుసుకుని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ప్రవీణ దంపతులు వైద్యశాలకు వెళ్లి పీవో రాహుల్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదిలా ఉంటే భద్రాచలం ఏరియా వైద్యశాలలో ఐఏఎస్‌ల సతీమణులు ప్రసవించటం ఇటీవల కాలంలో ఇది మూడోసారి. గతంలో ఐటీడీఏ పీవోగా బాధ్యతలు నిర్వర్తించిన వీపీ గౌతమ్ సతీమణి, అలాగే గతంలో భద్రాద్రి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించిన సమయంలో ప్రస్తుత ఖమ్మం కలెక్టర్ అనుదీప్ సతీమణి కూడా ఇక్కడే ప్రసవించారు. శుక్రవారం ఐటీడీఏ ఐటిడిఎ పీవో రాహుల్ సతీమణి మనీషా మగ శిశువుకు జన్మనిచ్చారు.

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



మున్నేరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మం రూరల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్వహించే గణేష్ నమిజ్జనం కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏదులాపురం మున్సిపాలిటీ నాయుడుపేట పరిధిలోని మున్నేరు వద్ద వినాయక నిమజ్జన ప్రదేశాలను గుర్తించేందుకు పెద్దతండా, ప్రకాశ్‌నగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమజ్జన ప్రదేశాల వద్ద అవసరం మేరకు భారీ క్రేన్లు, లైటింగ్, సీసీటీవీ ఏర్పాట్లు చేయాలన్నారు. గజ ఈతగాళ్లను మోహరించాలని, మెడికల్ క్యాంపులు, అగ్నిమాపక సేవలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఒకరు పెంచుతున్నారు.. మరొకరు తుంచుతున్నారు..





చెట్లను నరికిన దృశ్యం

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు15, (ఆంధ్రజ్యోతి) : ఒకరు మొక్కలు నాటి పెంచాలని విస్తృత ప్రచారం చేస్తుంటే మరోకరు ఎవరికి చెప్పకుండానే నరకడంతో ప్రజల్లో ఆందోళన కలుగుతుంది. జిల్లాలోని వివిద గ్రామ పంచాయతీలు మునిసిపాలిటీల పరిధిలోని రోడ్లకు ఇరువైపులా చెట్లు నాటే కార్యక్రమం దశాబ్ధాల నుంచి చేపట్టారు. అయితే మొక్కలు నాటే సమయంలో సరైన అవగాహన లేకపోవడం వల్ల కరెంటు తీగల కింద మొక్కలు నాటడం వల్ల అది వృక్షాలుగా మారి విద్యుత్ శాఖ వారికి అటంకంగా మారింది. తరుచుగా విద్యుత్ శాఖ వారికి ఈ వృక్షాలు విద్యుత్ సరఫరాకు అటంకం కలిగించడంతో వాళ్ల ఇష్టం వచ్చినట్లు చెట్లు నరికేస్తున్నారు. లక్షలాది రూపాయలుమొక్కలు నాటడానికి పెంచటానికి ప్రభుత్వం ఖర్చు చేస్తుంటే మరోవైపు విద్యుత్ శాఖవారు వాటిని నరికి వేస్తున్నారు. మొక్కలు నాటే సమయంలో విద్యుత్ స్తంబాలకు దూరంగా పెంచడం వల్ల ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఉండదు.

ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తా

బీటీపీఎస్ నిర్వాసితుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

కొమురం భీం విగ్రహావిష్కరణలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మణుగూరు రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : ఆదివాసీల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. శుక్రవారం పినపాక నియోజకవర్గం మణుగూరు మండలంలోని చిక్కుడుగుంట గ్రామంలో బీటీపీఎస్ ఉద్యోగ జేఏసీ, ఆదివాసీ నిర్వాసిత కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమరంభీం విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడారు. ఆదివాసీ జాతికి ఆదర్శం కొమరంభీం అని, తాను గిరిజనేతరులకు వ్యతిరేకం కాదని, అలా అని ఆదివాసీ బిడ్డలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమన్నారు. బీటీపీఎస్‌లో భూములు కోల్పోయిన అనేక మంది గిరిజనులకు అన్యాయం జరిగినట్టు తన దృష్టికి వచ్చిందని దీనిపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. గిరిజనులకు పోడు హక్కు పత్రాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, అలాగే అడవులను కాపాడాల్సిన బాధ్యత కూడా ఆదివాసీలపై ఉందన్నారు. ఈ ప్రాంతంలో ఎప్పటి నుంచో సర్వేలకే పరిమితమైన పులుసుబొంత ప్రాజెక్టు అవశ్యకతను ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి ఈ ప్రాంత ఎమ్మెల్యే పాయం ద్వారా ముఖ్య మంత్రిని కలసి నిధులు రాబట్టేందుకు ప్రయత్నాలు చేస్తామన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవాలైన సమ్మక్క సారలమ్మ జాతరను ఆదివాసీ సాంప్రదాయాలు ఉట్టిపడేలా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం ఈ జాతర నిర్వాహణకు రూ.150 కోట్లు విడుదల చేసిందని ఈ నిధులతో స్థానిక అభివృద్ధి పనులు, గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం, ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంత్రికి వినతి పత్రం అందజేశారు. జాతీయ ఆదివాసీ వికాస పరిషత్ అభ్యదయ సంఘం జాతీయ అధ్యక్షుడు చందాలింగయ్య దొర అధ్యక్షతన జరిగిన ఈ సభలో పినపాక, భద్రాచలం ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావ్, ఆదివాసీ సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు వట్టం నారాయణ, వర్సా శ్రీనివాస్, ఉపేందర్, గొగ్గల రామకృష్ణ, కుంజా వెంకటరమణ, చిడెం నాగేశ్వరరావు, కుంజా కృష్ణ, పాయం సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, వాసం రామకృష్ణ, ఆర్కే దొర, గోపాల్, తిరుపతమ్మ, భిక్షపతి, రాంబాబు, సంతోష్ కుమార్, శంకర్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

జవాన్ కుటుంబానికి ఎంపీ రఘురాంరెడ్డి పరామర్శ



అనిల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

కారేపల్లి, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో మృతిచెందిన ఆర్మీ జవాన్ అనిల్ కుటుంబాన్ని అనివిధాలుగా అండగుంటామని ఖమ్మం ఎంపీ రామసాయం రఘురాంరెడ్డి, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. శుక్రవారం వీరు సూర్యతండాలో అనిల్ కుటంబసభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా అనిల్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదే విధంగా గుండెపోటుతో మృతి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు జడల వెంకటేశ్వర్లు మృతదేహాన్ని వారు సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనువాస్‌రావు, బొర్ర రాజశేఖర్, రాంమూర్తి, పగడాల మంజూల, ఇమ్మడి తిరుపతిరావు, మల్లెల నాగేశ్వరరావు, నర్సింగ్ శ్రీనివాస్‌రావు, సీఐ తిరుపతిరెడ్డి, ఎస్ఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌టీవో ఉపాధ్యక్షుడిగా చిత్తలూరి



సత్తుపల్లి, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీవో) ఉపాధ్యక్షుడిగా చిత్తలూరి ప్రసాద్ నియమిస్తూ ఆసంఘ సెక్రటరీ జనరల్ సీఎల్.రోజ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశా రు. ఈ సందర్భంగా చిత్తలూరి మాట్లాడుతూ తాను పీఆర్‌టీయూ టీటీస్ సంఘంలో ఆరేళ్లు జిల్లా నాయకుడిగా, ఇరవై ఏళ్లు రాష్ట్ర నాయకుడిగా, పదేళ్లు అధికార మాసపత్రిక సంపాదకవర్గ సభ్యుడిగా, ఉపసంపాదకులు అందించిన సేవలను గుర్తించిన సంఘం జాతీయ స్థాయిలో తనను వైస్ చైర్మన్‌గా నియమించిందన్నారు. ఈ సందర్భంగా సీఎల్.రోజ్, సహకరించిన శాసన మండలి సభ్యుడు పీ.శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పీ.దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు కట్టా శేఖర్, ఆర్.రంగారావు, సత్తుపల్లి మండల శాఖలకు కృతజ్ఞతలు తెలిపారు.

తమ్మినేని కృష్ణయ్యకు ఘన నివాళి

ఖమ్మం రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మున్సిపాలిటి పరిధిలోని తెల్దారుపల్లి గ్రామంలో తమ్మినేని కృష్ణయ్య మూడో వర్ధంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు గ్రామంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కృష్ణయ్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యురాలు తమ్మినేని మంగతాయి, తమ్మినేని నవీన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సున్నతల కుంటకు గండి పెట్టిన రైతు

చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు రైతుల వినతి

కామేపల్లి, ఆగస్ట్ 15(ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజీవ్‌నగర్ తండ ముచ్చర్ల రెవెన్యూలో గల సున్నతల కుంటకు కడారి చంద్రయ్య అనే రైతు గండికొట్టి నీటిని వృధాగా వదులుతున్నాడని ఆ ఆయకట్టులోని రైతులు తహసీల్దార్ సుధాకర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆ ఆయకట్టు కింద 30ఎకరాలు సాగవుతోందని, అయన కుంటకు గండి కొట్టడం వల్ల సాగుకు ఇబ్బందిపడే పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోయారు. వెంటనే విచారణ చేపట్టి గండిని పూడ్చి నీరునిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

నాగులవంచ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సేవలు కొనసాగింపు

సర్క్యులర్ జారీ చేసిన రైల్వేశాఖ

చింతకాని, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నాగులవంచ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల సేవలను శాశ్వతంగా మూసివేస్తున్నట్లు రైల్వేశాఖ ఇటీవల సర్క్యులర్ నెంబర్ 117/2025ను జారీచేసింది. ప్రయాణికుల సేవలను యథాతథంగా కొనసాగించాలని పాతర్లపాడు, రైల్వేకాలనీ గ్రామాల నాయకులు, ప్రజలు నిరసన తెలపడంతో స్పందించిన రైల్వేశాఖ ఇచ్చిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకున్నట్లు శుక్రవారం మరో సర్క్యులర్‌ను విడుదల చేసింది. సేవలను కొనసాగించేలా చర్యలు తీసుకున్న రైల్వేశాఖ అధికారులకు ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

ఏదీ నాటి వైభవం?

(5వ పేజీ తరువాయి)

నిధులు కూడా కేటాయించడం గమనార్హం. నాడు జాతీయ స్థాయిలో రాష్ట్రానికి వన్నెతెచ్చిన ఇల్లెందు మాజీ మున్సిపల్ చైర్మన్ డీవిని గత కేంద్ర ప్రభుత్వంలో మంత్రి హర్దీప్‌సింగ్ సత్కరించారు. అలాంటి ఖ్యాతి గడించిన ఇల్లెందు పురపాలక సంఘం కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన స్వచ్ఛ ర్యాంకుల్లో వెనుకబడిపోవడం గమనార్హం.

జిల్లా పురపాలికలన్నీ వెనుకబాటే..

స్వచ్ఛ సర్వేక్షణ్-2024 కార్యక్రమాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పురపాలికలన్నీ వెనుకబడటం గమనార్హం. గతంతో పోలిస్తే భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల పరిధిలో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ఏ నగరాలకు, మున్సిపాలిటీలకి కూడా గౌరవప్రద స్థానాలు లభించలేదు. ఇటీవల వెల్లడించిన స్వచ్ఛ సర్వేక్షణ్- 2024 రాష్ట్ర, జాతీయ ర్యాంకులు బహిరంగ మూత్ర విసర్జనలు (ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ- ఓడీఎఫ్), చెత్త రహిత పట్టణ (గార్బేజ్ ఫ్రీ సిటీ - జీఎఫ్‌సీ) విభాగాల్లో ర్యాంకులు ఇలా ఉన్నాయి. జీఎఫ్‌సీ విభాగంలో జిల్లాలోని ఏ పురపాలికకు స్టార్ స్టేటస్ లభించకపోవడం గమనార్హం.

మున్నేరు దోబూచులాట

ఉదయం 8 అడుగులు, మధ్యాహ్నానికి 12కి చేరిక, రాత్రికి 11అడుగుల వద్ద నీటి మట్టం

అధికారుల ఉరుకులు, పరుగులు



మధ్యాహ్నం 12 అడుగులకు చేరిన మున్నేరు వరద

ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఖమ్మం వద్ద మున్నేరు వరద దోబూచులాడుతోంది. నగరంలో వర్షం లేకపోయినా ఎగువన ఆకేరు, బుగ్గవాగుకు వచ్చిన వరద మున్నేరుకు చేరుతోంది. అయా ప్రాంతాల నుంచి వరద ఖమ్మం ప్రాంతంలోని మున్నేరుకు చేరుకోవటానికి రెండు గంటల సమయం పడుతోంది. వర్షం పడుతూ ఆగుతూ ఉండటంతో వరద తీవ్రత కూడా ఆదే విధంగా పెరుగుతూ.. తగ్గుతూ వస్తోంది. గతేడాది సెప్టెంబరు 1న ఇదే రీతిగా తెల్లారుజామున మున్నేరు వరద ప్రజలను ముంపుకు గురి చేసింది. శుక్రవారం ఉదయం 8గంటలకు 8అడుగులకు వరద నమోదవగా మధ్యాహ్నం 12గంటలకు అనూహ్యంగా 12అడుగులకు చేరింది. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కానీ తర్వాత తగ్గుతూ వచ్చి రాత్రి 8గంటలకు 11అడుగులకు దగ్గింది. దీంతో కలెక్టర్ అనుదీప్, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య అప్రమత్తమయ్యారు. కేఎంసీ అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కు ప్రత్యేకంగా బాధ్యతలు కేటాయించారు. ఆయనున్న మున్నేరు వద్దనే పర్యవేక్షణకు ఉంచారు.

ముస్తాబైన కృష్ణ మందిరాలు

నేడు శ్రీ కృష్ణాష్టమి

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. కృష్ణాష్టమిని పురస్కరించుకొని కృష్ణ మందిరాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. మమతారోడ్‌లోని ఇస్కాన్ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకానున్నారు. ఈ వేడుకల్లో చిన్నారులు గోపిక, కృష్ణుడి వేషధారణలతో పాటు ఉట్టికొట్టే కార్యక్రమంలో పాల్గొంటారు. వేడుకల్లో భాగంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలతో పాటు రాత్రి శ్రీకృష్ణుడి డోలారోహణ ఘనంగా జరుపుకోనున్నారు. జిల్లాలోని పలు ఆలయాల్లో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు యువకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గాంధీచౌక్ శ్రీకృష్ణ ఆలయం, ఖానాపురంలోని శ్రీకృష్ణుని ఆలయాలలో కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. వివిధ పాఠశాలల విద్యార్థులు గోపిక, కృష్ణుడి వేషధారణలతో వేడుకల్లో పాల్గొంటారు. శీకృష్ణాష్టమి ఆబాల గోపాలాన్ని అలరించే పండు గ. శ్రీకృష్ణ జన్మాష్టమి రోజున కృష్ణుడు ఇంట్లోకి రావాలని ఆశిస్తూ వాకిట్లో బియ్యం పిండి లేదా ముగ్గులతో బాలగోపాలుడి పాదాలను తీర్చిదిద్దడం తో పండుగ వాతావరణం మొదలవుతుంది. ద్వారా లకు మామిడాకులు, వివిధ పూలతో తోరణాలు కడతారు. కృష్ణాష్టమి రోజున భక్తులు పగలంతా ఉపవాసం ఉండి సాయంత్రం కృష్ణుడిని పూజిస్తారు. శ్రావణ మాసంలో లభించే పళ్లు, అటుకులు, బెల్లం కలిపిన వెన్న, పెరుగు, మీగడతో స్వామివారికి నైవేద్యం పెడతారు. వీధుల్లో ఉట్లు కట్టి ఉత్సాహంతో యువత పోటీలు పడుతూ కేరింతలు కొడుతారు.

యాదవుల వేడుకలు



కృష్ణాష్టమి అంటే యాదవులు ప్రత్యేకంగా సామూహికంగా వేడుకలను నిర్వహిస్తారు. పండుగ రోజు ప్రత్యేక పూజలు చేస్తారు. అర్ధరాత్రి 12గంటల నుంచి ఈ వేడుకలను ప్రారంభిస్తారు. ఊయలసేవ నిర్వహిస్తారు. కృష్ణుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ముగింపు ఘట్టంగా నిర్వహించి సహపంక్తి భోజనాన్ని అరగిస్తారు. కృష్ణాష్టమి వేడుకలను పల్లె, పట్టణం తేడాలేకుండా సంప్రదాయ బద్ధంగా జరుపుకొంటారు.

వాలీబాల్, జిమ్నాస్టిక్స్ కోచ్‌ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం స్పోర్ట్స్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలోని వాలీబాల్, జిమ్నాస్టిక్స్ క్రీడా విభాగాలకు కోచ్‌ల నియామకానికి అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రజ్యోతి దినపత్రికలో ఈనెల 12న ప్రచురితమైన 'వాలీబాల్ క్రీడకు దిక్కెవరు?' అనే కథనానికి అధికారులు స్పందించారు. వాలీబాల్ క్రీడలో డిప్లొమా కోర్సు చేసిన అభ్యర్థులు, 6 వారాల కోచింగ్ శిక్షణ పొందిన వారు, సీనియర్ క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 23వ తేదీ కల్లా దరఖాస్తులను జిల్లా క్రీడల శాఖ కార్యాలయంలో అందించాలని కోరారు.

కేయూ దూరవిద్య ప్రవేశాలకు సెప్టెంబరు 10 వరకు గడువు పొడిగింపు

ఖమ్మం, ఖానాపురం హవేలీ 15(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలో సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్ లైన్ ఎడ్యుకేషన్ (గతంలో ఎస్‌డిఎల్‌సిఈ)లో డిగ్రి, పీజీ, డిప్లమా కోర్సుల్లో ప్రవేశాల కోసం దరఖాస్తులను సెప్టెంబర్ 10వ తేదీ వరకు పొడిగించినట్లు నగరంలోని యూనివర్సిటీ పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 43 కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో స్వీకరిస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 8008811998 నెంబరును సంప్రదించిలని తెలిపారు.

యూరియా కొరతతో రైతుల ఇబ్బందులు

రెండు కట్టల యూరియా కోసం ఏడు గంటల నిరీక్షణ



వేంసూరు సొసైటీ కార్యాలయం వద్ద యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

వేంసూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలంలో యూరియా కొరత రైతులను వేధిస్తుంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులకు సరిపడా యూరియా సరఫరా కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం నుంచి మండలంలో యూరియా కొరత తీవ్రంగా ఉంది. ఒక్కో సొసైటీకి కేవలం 200నుంచి 300యూరియా కట్టలు రావడంతో రైతులు వాటిని తీసుకువెళ్లేందుకు గంటలకొద్దీ నిరీక్షించాల్సి వస్తుందని వాపోతున్నారు. రైతుల ఆధార్‌కార్డులను వరుస క్రమంలో పెట్టి యూరియా కట్టలను అరకొరగా సరఫరా చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం వేంసూరు సొసైటీ కార్యాలయానికి 300కట్టలు వచ్చినప్పటికీ గతంలో వరుస క్రమంలో ఆధార్‌కార్డులు పెట్టిన రైతులకు మాత్రమే సరఫరా చేయడంతో మిగిలిన రైతులు వెనుదిరిగాల్సిన దుస్థితి నెలకొంది. ప్రైవేట్ వ్యాపారులు రెండు కట్టల కాంప్లెక్స్ ఎరువులు తీసుకుంటేనే రూ.400కు ఒక యూరియా కట్ట మాత్రమే ఇస్తున్నారని రైతులు వాపోతున్నారు. తమకు సరిపడా యూరియా సరఫరా చేయటం లేదని ప్రభుత్వంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తమకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

తునికి చెట్లను దొంగిలించే అంతర్రాష్ట్ర దొంగల ఆచూకీ తెలపాలి

ఏడూళ్ళ బయ్యారం రేంజర్ తేజస్వీ



గ్రామస్థులతో మాట్లాడుతున్న రేంజర్ తేజస్వీ

కరకగూడెం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : అంతర్రాష్ట్ర దొంగల ముఠా అడవీలో తునికి చెట్లను దొంగిలిస్తున్నట్లు సమాచారం ఉందని, దొంగల ఆచూకీ తెలిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని ఏడూళ్ళ బయ్యారం రేంజర్ తేజస్వీ తెలిపారు. శుక్రవారం మండలంలోని వలస ఆదివాసీ గ్రామాల్లో ఈమేరకు ప్రజలకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రేంజర్ తేజస్వీ మాట్లాడుతూ.. కరకగూడెం, పినపాక, మణుగూరు రిజర్వ్ ఫారెస్ట్‌లోని అటవీలో తునికి చెట్లను నరికి అపహరించే అంతర్రాష్ట్ర దొంగల ముఠా వచ్చినట్లు విస్వనీయ సమాచారం ఉందన్నారు. మీ ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు కానీ, అనుమానితులుగా అడవీలో కనిపించిన వ్యక్తులను చూస్తే వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. అంతర్రాష్ట్ర దొంగలపై ప్రత్యేక నిఘా పెట్టామని.. అంతర్రాష్ట్ర దొంగలకు ఎవరైనా సహకరించి అటవీ సంపదకు విగాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్లు గోవింద్, వెంకటమ్మ, సూరయ్య, ఏడుకొండలు, బీట్ ఆఫీసర్లు అశోక్, రోజా, గోపి, కోటేష్, లక్ష్మీనర్సు, సురేష్, రాజేష్, స్వప్న, గోవర్ధన్, మోహన్, సాంబ బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షకుడికి అరుదైన గౌరవం

హైదరాబాద్ రాజ్‌భవన్‌లో పంద్రాగస్టు వేడుకలో హాజరైన రాజశేఖర్



ఆహ్వాన పత్రాన్ని చూపుతున్న రాజశేఖర్

చుంచుపల్లి, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితాన్ని కోరుతూ మొక్కలను పెంచడమే లక్ష్యంగా తన జీవితాన్ని పర్యావరణ పరిరక్షణ కు మొక్కలు నాటుతున్న కొట్టూరినుర్సీ రాజశేఖర్ అలియాస్ మొక్కల రాజశేఖర్‌గా పేరు ప్రఖ్యాతలు గాంచిన రాజశేఖర్‌కి అరుదైన గౌరవం దక్కింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా హైదరాబాద్ రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం అందింది. దీంతో రాజశేఖర్ శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే రాజ్‌భవన్ నివాసగృహంలో ఏర్పాటు చేసిన తేనేటి విందుకు హాజరయ్యారు.

రోడ్డుపై మత్స్యవేట

నిలిచిన రాకపోకలు



రోడ్డుపై చేపలు పడుతున్న ప్రజలు

తిరువంలాయపాలెం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీరోలు- కాకరవాయి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచాయి. బీరోలు పెద్దచెరువు అలుగు పడడంతో ఆ నీటి ప్రవాహానికి చేపలు రోడ్డుపైకి చేరాయి. సుబ్లేడు నుంచి బీరోలు పెద్దచెరువుకు నీటి ప్రవాహం పెరగడంతో చేపలన్నీ దిగువ ప్రాంతాలకు వెళుతున్నాయి. ఈ చేపలను పట్టేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు బారులు తీరారు. వలల సహాయంతో చేపల వేట కొనసాగించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ జగదీష్ వారిని వెళ్లగొట్టారు.

కనకగిరి అడవుల్లో నీలిరంగు పుట్టగొడుగు

న్యూజిలాండ్‌లోని ఎంటోలోమా హోచెస్టెటెరీ జాతికి చెందినదిగా అధికారుల వెల్లడి



పులిగుండాల వద్ద మొలిచిన నీలి రంగు పుట్టగొడుగు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): న్యూజిలాండ్ దేశానికి చెందిన ఎంటోలోమా హోచెస్టెటెరీ జాతికి చెందిన నీలి ఆకాశ పుట్టగొడుగు (స్కైబ్లూ మష్రూమ్) మన కనకగిరి అడవుల్లో మొలకెత్తింది. ఈ విషయాన్ని ఎఫ్‌డీవో వాడపల్లి మంజుల 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. సత్తుపల్లి ఫారెస్ట్ డివిజన్‌లోని పెనుబల్లి, కల్లూరు మండలాల్లో విస్తరించి ఉన్న కనకగిరి హిల్స్‌లోని పులిగుండాల వద్ద ఈ అరుదైన మష్రూమ్ మొలకెత్తిందన్నారు. దీనిని ఆహారంగా తీసుకున్నట్లయితే పాయిజన్‌లా మారుతుందని చెప్పారు. పులిగుండాల ప్రాజెక్టుకు సమీపంలో ఉన్న పురాతన శివాలయం (గుండెపూడి) వెనుక దట్టమైన అటవీ ప్రాంతంలో ఈ మష్రూమ్‌ను కనుగొన్నట్లు పేర్కొన్నారు. విలక్షణమైన రంగు కలిగి ఈ నీలి ఆకాశ పుట్టగొడుగు అరుదైన లక్షణమైన అజులీన్ వర్ణ ద్రవ్యాల వల్ల కలుగుతుందని, వర్షాకాలంలో తేమస్థాయిలకు అనుకూలంగా ఉన్నచోట్ల మొలకెత్తుతుందని అధికారులు తెలిపారు. న్యూజిలాండ్ దేశంలో 2002లో జారీచేయబడిన యాబై డాలర్ల నోటుపై ఈ పుట్టగొడుగు చిహ్నంగా కనపిస్తుందని, ఇది ఒక సాప్రోబిక్ శిలీంద్రమని, సేంద్రీయ పదార్థాన్ని విచ్ఛిన్నం చేస్తుందని, అటవీ ప్రాంతంలో పోషకచక్రానికి దోహదం చేస్తుందని ఎఫ్‌డీవో తెలిపారు. తెలంగాణ అడవుల్లో జీవవైవిధ్యం సంరక్షించబడుతుందని, భవిష్యత్ తరాల కోసం, ఇతర పరిశోధనల కోసం మనం రక్షించాల్సిన అవశ్యకత ఉందని, ఇలా వివిధ రకాలు, జాతులకు చెందిన పశుపక్ష్యాదులు, జీవాలతో పాటు అరుదైన రకానికి చెందిన మొక్కలు మనకు దర్శనమివ్వడం సంతోషంగా ఉందన్నారు.

రామయ్యకు రూ1.90 లక్షల బంగారు ఆభరణాలు సమర్పణ



ఆభరణాలను అందజేస్తున్న దాతలు

భద్రాచలం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి వారికి భద్రాచలంకు చెందిన ముదునూరు బలరామకృష్ణంరాజు పేరున ఆయన సతీమణి పద్మావతి రూ.1.90 లక్షలు విలువైన బంగారు ఆభరణాలను తయారు చేయించగా వారి సమీప బంధువు ఉప్పలపాటి అజయ్‌కుమార్ దేవస్థానం ఈవో ఎల్.రమాదేవికి శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం పర్యవేక్షకులు కత్తి శ్రీనివాసరావు , శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

స్వర్ణకవచంలో దర్శనమిచ్చిన రామయ్య

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి మూలవరులను స్వర్ణకవచంతో అలంకరించారు. ప్రతి శుక్రవారం నాడు మూలవరులను స్వర్ణకవచంలో అలంకరింపజేయడం జరుగుతుంది. ఈ క్రమంలో రామయ్యను స్వర్ణకవచంలో అలంకరించడంతో భక్తులు స్వామి వారిని దర్శించి పులకించారు. కాగా నిత్యకళ్యాణాన్ని శ్రీ సీతారామచం ద్రస్వామి వారికి ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసంలో శు క్రవారం కావటంతో లక్ష్మీతాయారు అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే సామూహిక కుంకుమార్చన సైతం భక్తి ప్రపత్తులతో నిర్వహించారు.

అనారోగ్యంతో గార్ల ఏఎస్‌ఐ మృతి



ఏఎస్‌ఐ నూరుద్దీన్ (ఫైల్)

కారేపల్లి ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఏఎస్‌ఐ నూరుద్దీన్ (59) శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లో మృతి చెందాడు. కారేపల్లి పట్టణానికి చెందిన నూరుద్దీన్ ప్రస్తుతం మహబూబాబాద్ జిల్లాలోని గార్ల మండలంలో ఏఎస్‌ఐ విధులు నిర్వర్తిస్తున్నాడు. కారేపల్లి మండలంతో పాటు ఉమ్మడి జిల్లాలో పలు పోలీసుస్టేషన్లలో కానిస్టేబుల్‌గా ఉద్యోగం చేస్తూ ఏఎస్‌ఐ స్థాయి వరకు వచ్చాడు. ఇటివలనే కామేపల్లి మండలంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తూ పదోన్నతిపై గార్ల మండలానికి ఏఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్నాడు. గత వారం రోజులుగా అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్సపొందుతున్న ఆయన శుక్రవారం ఉదయం కన్నుమూశాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. నూరుద్దీన్ మృతిపట్ల కారేపల్లి రూరల్ సీఐ బి.తిరుపతిరెడ్డి, ఎస్‌ఐ గోపి, గార్ల ఎస్‌ఐ రియాజ్ పాషా, పోలీస్‌సిబ్బంది సంతాపం తెలిపారు. కాగా ఏఎస్‌ఐ మృతదేహాన్ని రాత్రికి కారేపల్లికి తీసుకు వస్తున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

యాతాలకుంటలో అడవిపంది మాంసం పట్టివేత

సత్తుపల్లిరూరల్, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): వండుకు తినేందుకు సిద్ధంగా ఉన్న సుమారు 3 కేజీల అడవిపంది మాంసాన్ని సత్తుపల్లి అటవీ శాఖ అధికారులు పట్టుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బీట్ ఆఫీసర్ కే.కిరణ్, ఎఫ్‌ఎస్‌వో నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం సత్తుపల్లి మండలం యాతాలకుంటకు చెందిన నాగార్జున రామకృష్ణ, నాగరాజులు తమ పంటచేలో కుక్కల దాడిలో మృతిచెందిన 6-8నెలల వయస్సు గల అడవిపంది కనిపించింది. వండుకు తినేందుకు కొందరు ఇంటికి తీసుకురాగా తమకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని మాంసంను స్వాధీనం చేసుకున్నాము. ఇరువురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. వణ్యప్రాణుల సంరక్షణ చట్టం అనుసరించి కేసు తీవ్రతను బట్టి తదుపరి విచారణతో పాటు శిక్ష ఉంటుందని అటవీ అధికారులు తెలిపారు.

నిశ్చితార్థం ఆగిందని మనస్తాపంతో యువతి ఆత్మహత్య



గౌతమి మృతదేహం

గుండాల ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): నిశ్చితార్థం ఆగిపోవడంతో ఓ యువతి మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై సైదా రావూఫ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చీమలగూడెం గ్రామానికి చెందిన అరెం గౌతమి(22)కి అదే గ్రామానికి చెందిన ఓ యువకుడితో ఆరు నెలల క్రితం పెళ్లిసంబంధం కుదిరింది. నిశ్చితార్థం జరిగే క్రమంలో అనివార్య కారణాలతో ఆగిపోయింది. అప్పటి నుండి ఆమె తీవ్ర మనస్తాపంతో ఉంది. శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుండాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యం అందిస్తుండగా పరిస్థితి విషమించి ఆమె మృతిచెందింది. గుండాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా సకాలంలో వైద్యం అందకనే తమ కూతురు మరణించిందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరుగుల మందు తాగిన యువతిని ఆసుపత్రికి తీసుకురాగా అందుబాటులో వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో సకాలంలో వైద్యం అందలేదని చెప్పారు. కుటుంబ సభ్యులు వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తే లక్ష్యం

థర్మల్‌తో పాటు సోలార్ విద్యుత్‌నూ ప్రోత్సహిస్తాం

సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి కృషి


స్వాతంత్ర్య వేడుకల్లో సింగరేణి చైర్మన్ బలరాం



జాతీయజెండాను ఆవిష్కరించిన సింగరేణి చైర్మన్ బలరాం

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : భవిష్యత్‌లో సింగరేణిలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నామని సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో జరిగిన వేడుకల్లో ఆయన జాతీయజెండాను ఆవిష్కరించారు. సింగరేణి సెక్యూరిటీ నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ విద్యుత్ అవసరాలకు సింగరేణి బొగ్గును రవాణా చేస్తున్నామని తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాలకు సైతం బొగ్గును అందిస్తున్న చరిత్ర సింగరేణికి ఉందన్నారు. థర్మల్ విద్యుత్‌ను 3వేల మెగావాట్లకు పెంచే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేశామని ప్రకటించారు. 5వేల మెగావాట్లకు సోలార్‌విద్యుత్‌ను పెంచేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సింగరేణి సంస్థ అభివృద్ధి, కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. కీలక ఖనిజాల రంగంలో సైతం సింగరేణి రంగ ప్రవేశం చేస్తుందని ప్రకటించారు. విదేశాల నుంచి రవాణా అవుతున్న బొగ్గు చౌకధరలకు లభిస్తుండటంతో కొన్ని పరిశ్రమలు ఆ బొగ్గును కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడం వల్ల బొగ్గు విక్రయాలు తగ్గుముఖం పట్టాయన్నారు. సింగరేణిలో యంత్రాల వినియోగ సమయాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. పోటీ ప్రపంచంలో బొగ్గు ధరలను తగ్గించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని సవాళ్లను అధిగమిస్తామన్నారు. సింగరేణి సంస్థలోని సుమారు 25వేల మంది యువ కార్మికులంతా సంస్థ అభివృద్ధి కోసం శ్రమించాలన్నారు. నూతన ప్రాజెక్టులను త్వరలోనే ప్రారంభించుకోనున్నామన్నారు. కొత్తగూడెం ఏరియాలో వెంకటేష్ ఓపెన్‌కాస్టు, ఇల్లెందులోని రొంపేడు ఓపెన్‌కాస్టు, రామగుండం, బెల్లంపల్లి ఏరియాల్లో త్వరలోనే నూతన ఓపెన్‌కాస్టులను ప్రారంభిస్తామని తెలిపారు. కార్మికుల ప్రాంతాల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపట్టామని, రూ.కోటి 25లక్షల ప్రమాద బీమాను అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ, ప్రవేట్, సింగరేణి పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సింగరేణి సంస్థకు ఉత్తమ సేవలు అందచేసిన కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (పా) గౌతమ్ పోట్రు, డైరెక్టర్లు ఎల్‌వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, సత్యనారాయణరావు, కార్మికసంఘం నాయకులు రాజ్‌కుమార్, త్యాగరాజన్, లక్ష్మీపతిగౌడ్, జీఎంలు కవితానాయుడు, జీవీ కిరణ్‌కుమార్, చింతల శ్రీనివాస్, బొజ్జ రవి, శ్రీనివాసరావుతోపాటు పలువురు ఏజీఎంలు, డీజీఎంలు పాల్గొన్నారు.

సీఎం పర్యటనపై అధికారులతో ఎమ్మెల్యే జారే సమీక్ష



సీఎం ప్రారంభించే ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఓఎస్‌డీ

చండ్రుగొండ, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభించేందుకు ఈ నెల 21న ముఖ్యమంత్రి రేంవత్‌రెడ్డి ఆదర్శ గ్రామమైన బెండాలపాడుకు వస్తున్న నేపథ్యంలో సీఎం పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై ఎమ్మెల్యే జారె ఆదినారాయణ శుక్రవారం బెండాలపాడులో జిల్లా, మండలస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సీఎం ప్రారంభించేందుకు అనువుగా ఉన్న పలు ఇళ్లను ఎమ్మెల్యే, ఓఎస్‌డీ నరేందర్ పరిశీలించారు. అనంతరం చంద్రుగొండలో హెలిప్యాడ్ ఏర్పాటుకు స్థలాన్ని పోలీసు అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ పలు శాఖల ఉన్నతాధికారులతో బెండాలపాడులో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు సీఎం పర్యటనకు సంబంధిచిన పూర్తి వివరాలు మీడియాకు వివరించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు పార్టీ నాయకులు మాళోత్ బోజ్యానాయక్, నల్లమోతు రమణ, సారేపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసాని జలాశయానికి భారీగా వరద

404.70 అడుగులకు చేరిన నీటి మట్టం

పాల్వంచ రూరల్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి) : పాల్వంచ మండలంలోని కిన్నెరసాని జలాశయానికి ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరదనీరు చేరుతోంది. శుక్రవారం 404.70 అడుగులకు నీటి మట్టం పెరిగింది. మహబూబాబాద్ జిల్లాలోని పాకాల కొత్తగూడం నుంచి గుండాల, ఇల్లెందు, టేకులపల్లి, కొత్తగూడెం అటవీ ప్రాంతాల నుంచి జలాశయానికి 1,700 క్యూసెక్కుల చొప్పున నీరు చేరడంతో డ్యాం అధికారులు అప్రమత్తమయ్యారు. డ్యాం సామర్థ్యం 407 అడుగులు కాగా 404.70 అడుగులకు నీరు చేరడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. జలాశయం దిగువ ప్రాంతం లో ఉన్న లోతట్టు గ్రామాల ప్రజలు వాగులు దాటొద్దని హెచ్చరికలు జారీ చేశారు.

సాగర్ నీటి నిర్వహణ పకడ్బందీగా ఉండాలి

పాలేరు జలాశయాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ప్రస్తుత ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో అంశాలపై ఆరా



పాలేరు జలాశయం వద్ద పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): సాగర్ నీటి నిర్వహణ పకడ్బందీగా ఉండాలని అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం పాలేరు జలాశయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా పాలేరు జలాశయంలో ఉన్న నీటి నిల్వ, ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను ఐబీ ఖమ్మం సర్కిల్ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. పాలేరు జలాశయం గరిష్ట నీటిమట్టం, జిల్లాలో రెండోజోన్ ఆయకట్టు వివరాలను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాల కారణంగా ఎగువనుంచి వస్తున్న వరద ఎప్పటికప్పుడు అంచనావేస్తూ దిగువకు వదలాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో నీటిపారుదల, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు నీటి మట్టం అంచనా వేస్తూ జాగ్రత్తగా ఉండాలని ఆదేశించారు.

గిరిజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

మహనీయుల త్యాగాలకు దక్కే ఫలితం అదే..

భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్



మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని గిరిజనులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని, అప్పుడే మహనీయుల త్యాగాలకు ఫలితం దక్కినట్లవుతుందని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర ప్రభుత్వం ఐటీడీఏల ద్వారా గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఐటీడీఏ కార్యాలయంలో పీవో రాహుల్ జాతీయ జెండాను ఎగుర వేశారు. అనంతరం పీవో మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం విద్య, వైద్యం, ఇంజనీరింగ్, వ్యవసాయం, మౌలిక వసతులు, స్వయం ఉపాధి తదితర రంగాల్లో వారికి తోడ్పాటునందించాలని పేర్కొన్నారు. గిరిజన మ్యూజియం అభివృద్ధికి రూ.50లక్షలు వెచ్చించటంతో రోజు వెయ్యి మంది సందర్శకులు వస్తున్నారన్నారు. గిరిజన మ్యూజియంలో నూతనంగా ఏర్పాటు చేసిన అభివృద్ధి పనుల పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోందన్నారు. గిరిజన యువత శిక్షణ కేంద్రంలో వివిధ కోర్సుల్లో విద్యార్థులకు శిక్షణనిచ్చి వారికి ప్రైవేటు కంపెనీల్లో ఉపాధి చూపుతామ న్నారు. ఏజెన్సీలో ప్రైవేట్ రక్తపరీక్ష కేంద్రాల్లో ధరల నియంత్రణకు ఆదేశాలిచ్చామని, దీంతో ఎంతోమంది గిరిజనులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఎస్‌టీఎస్‌డీఎఫ్‌ల ద్వారా 87బీటీ రోడ్లు మంజూరు కాగా 18రోడ్లు పూర్తి చేశామన్నారు. 48పనులు పురోగతిలో ఉన్నట్టు తెలిపారు. ఉద్దీపకం-2 వర్కుబుక్స్‌తో 2వ తరగతి నుంచి 7వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేసి నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు, డీడీ మణెమ్మ, ఈఈ హరీష్, ఏవో సున్నం రాంబాబు, జీసీసీ డీఎం సమ్మయ్య పాల్గొన్నారు. పీవో ప్రసంగం అనంతరం వివిధ పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలివ్వగా.. ప్రతిభచాటిన వారికి బహుమతులను అందజేశారు. అలాగే ఐటీడీఏ పరిధిలో విధి నిర్వహణలో విశిష్ట సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.

ఉరివేసుకుని వ్యక్తి బలవన్మరణం

ఇల్లెందు టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం ఇల్లెందు పట్టణంలోనీ ఆమ్ బజారు ప్రాంతంలో చోటు చేసుకుంది. ఆమ్ బజారు ఏరియాకి చెందిన రవిశివ (50)అనే వ్యక్తి గుజరాత్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవలే ఇంటికి వచ్చిన అతను శుక్రవారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో నిద్రిస్తున్నాడనుకున్న కుటుంబ సభ్యులు ఆలస్యంగా గమనించి అతన్ని వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఇల్లెందు టౌన్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మండల పరిధిలోని మామిడిగుండాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మామిడిగుండాలకు చెందిన నిర్మల(58) ఓ వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వస్తుండగా మామిడిగుండాల సమీపంలో ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కింద పడింది. ఈ ఘటనలో గాయపడిన నిర్మలను ఖమ్మం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఇల్లెందు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



డీసీసీ కార్యాలయంలోని వేడుకల్లో పాల్గొన్న ఎంపీ రఘురాంరెడ్డి

సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం

» కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
» ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం ప్రజల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆకాంక్షించారు. 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఖమ్మం జుబ్లీపురాలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అంతకుముందు కలెక్టర్, మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్ ప్రత్యేక అధికారి హోదాలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిల్లా పరిషత్ కార్యాలయం ప్రాగణంలోని గాంధీజీ, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించి, జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. నేటి స్వాతంత్ర్య సంబురం వెలకట్టలేని వీరుల త్యాగ ఫలమన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీ ఈవో దీక్షా రైనా, జడ్పీ డిప్యూటీ సీఈవో నాగపద్మజ, పీఆర్ ఎస్ఈ వెంకటరెడ్డి, పీఆర్ఈఈ మహేష్‌బాబు, జిల్లా అధికారులు. సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా పరిషత్ కార్యాలయంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కలెక్టర్ అనుదీప్

ప్రజాసమస్యల పరిష్కారం దిశగా పని చేయాలి: అదనపు కలెక్టర్ శ్రీజ

ప్రజాసమస్యల పరిష్కార దిశగా పని చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ అన్నారు. శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ఆమె జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ఖమ్మం జిల్లామంచి పనితీరుతో ముందంజలో ఉందని, ఇదే స్ఫూర్తి కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో కె.శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేఎంసీలో ఘనంగా పంద్రాగస్టు

» జెండా ఆవిష్కరించిన మేయర్ నీరజ

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికుల నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు బాధ్యతతో పనిచేయటంతోనే నగరం పరిశుభ్రంగా రాష్ట్రంలోనే అవార్డులు పొందుతుందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ ఆగస్త్య ఆధ్వర్యంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవంలో జెండావిష్కరణ చేసి మాట్లాడారు. అవార్డులు ప్రశంస పత్రాలు రాని వారు పనిచేయనట్లు కాదని, ఒకేసమయంలో మంచిగా పనిచేసిన వారందర్ని గుర్తించటం కష్టంగా ఉంటుందన్నారు. మంచిగా పనిచేసిన వారికి మరోసారి ప్రశంస పత్రాలు ఇవ్వటం జరుగుతుందన్నారు. డిప్యూటీ మేయర్ పాతిమా జోహరా, సీపీఐ కార్పొరేటర్ బీజే క్లైమెట్ మాట్లాడారు. అసిస్టెంట్ కమిషనర్ అనిల్, ఈఈ కృష్ణలాల్, ఏసీపీ గంధం వసుంధర, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, డీఎంసీ సావల సుజాత, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, పారిశుధ్య పర్యవేక్షకుడు సాంబయ్య పాల్గొన్నారు.



జెండావిష్కరణ చేస్తున్న మేయర్ నీరజ



గ్రానైట్ టైల్స్ అసోసియేషన్, ఏఎంసీ కార్యాలయంలో వేడుకలు



రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో, నేలకొండపల్లిలో ఎస్ఐ సంతోష్..



జాతీయపతాకాన్ని ఎగుర వేస్తున్న ఏడీసీపీలు ప్రసాదరావు, కుమారస్వామి



తుమ్మల క్యాంపు కార్యాలయంలో మేయర్, కాంగ్రెస్ నాయకులు



ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో, కామేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో..



తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నాయకులు..





పటేల్ స్టేడియంలో..



టీడీపీకార్యాలయంలో..



జిల్లా కోర్టులో..




కూసుమంచిలోని మంత్రి క్యాంపుకార్యాలయంలో.., జెండా ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ, సీపీఐ కార్యాలయంలో సురేశ్..



సీపీఎం కార్యాలయంలో నున్నా



28వ డివిజన్‌లో కార్పొరేటర్ గజ్జల లక్ష్మీ



బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో..



ఖమ్మం అన్నం ఫౌండేషన్‌లో..



నేలకొండపల్లి తహసీల్దార్ కార్యాలయంలో.., కూలీలతో కలిసి నాటేస్తున్న బీజేపీ నాయకులు



తిరుమలాయపాలెం తహసీల్దార్ కార్యాలయంలో..



జాతీయజెండాను ఎగురవేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి, టీఎన్జీవో కార్యాలయంలో..



టీజీవో కార్యాలయంలో..



సీనియర్ పెన్షనర్లకు సన్మానం



కూసుమంచిలో..

జిల్లా అధికారులకు ప్రశంసా పత్రాలు

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వివిధ శాఖల్లో ఉత్తమసేవలు అందించినందుకు గాను జిల్లా అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ప్రశంసాపత్రాలను అందజేశారు.శుక్రవారం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వేడుకల్లో జిల్లా ప్రధాన శాఖల అధికారులకు ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందచేశారు. అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డి, మునిసిపల్ కమిషనర్ అభిషేక్‌అగస్త్య జిల్లా అధికారులు ఉన్నారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నుంచి అవార్డు అందుకుంటున్న అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డి, మునిసిపల్ కమిషనర్ అభిషేక్‌అగస్త్య



ఉత్తమ అవార్డు అందుకుంటున్న ఏదులాపురం మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్, సివిల్ సప్లయిాస్ డీటీ విజయ్‌బాబు



డిప్యూటీ సీఎం భట్టి నుంచి అవార్డు అందుకుంటున్న విక్రంసింగ్, దీక్షారైనా, పద్మశ్రీ, పుల్లయ్య, జ్యోతి, శ్రీనివాస్, సుమన్‌చక్రవర్తి, గౌస్‌పాష



సత్యనారాయణ, విజయలక్ష్మీ, దివ్య,విష్ణువందన, సునిల్‌రెడ్డి, శ్రీనివాసాచారి, సైదులు, సన్యాసయ్య



శ్రీనివాస్, శ్రీలత, నర్సింహారావు, ఆశాలత, దుర్గాప్రసాద్, రవీంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు, సంధ్య

విద్యాలయాల్లో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవం

ఖమ్మంఖానాపురంహవేలి, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని శుక్రవారం పలు విద్యాలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల త్యాగాలను విద్యార్థులకు వివరించారు. చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపారు. దేశభక్తుల అడుగుజాడల్లో నడవాలని విద్యార్థులకు వక్తలు పిలుపునిచ్చారు.



న్యూవిజన్ పాఠశాలలో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



హార్వెస్ట్‌లో..



న్యూఇరాలో..



గీతాంజలిలో..



శ్రీచైతన్యలో..



రెజోనెన్స్ శ్రీనగర్‌కాలనీలో..



సర్వజ్ఞలో..



క్రియేటివ్‌లో..



నిర్మల్‌హృదయ్‌లో..



త్రివేణిలో..



రేపు వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ

తల్లాడ, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలం రామచంద్రాపురం గ్రామంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే, ప్రజానాయకుడు వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని వీఎం రంగా ఉమ్మడి ఖమ్మంజిల్లా అభిమాన సంఘం నాయకుడు ఎస్.శ్రీనివాసరావు తెలిపారు ఈసందర్భంగా 17న మధ్యాహ్నం 3గంటలకు కల్లూరు నుంచి రామచంద్రాపురం వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్టు తెలిపారు రంగా విగ్రహాన్ని రంగా తనయుడు వంగవీటి రాధాకృష్ణ ఆవిష్కరిస్తారని, ముఖ్యఅతిథులుగా ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే మట్టా రాగమయి హాజరవుతారని తెలిపారు. ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా పంద్రాగస్టు వేడుకలు



బోనకల్‌లో....

మధిర, వైరా, సత్తుపల్లి నియోజకవర్గాల వ్యాప్తంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేశారు. ఆనాటి మహనీయులను స్మరించుకున్నారు. వారి ఆశయాలు సాధించాలన్నారు. దేశనాయకుల వేషధారణలో చిన్నారులు అలరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వివిధ పాఠశాలలో నిర్వహించిన ఆటపాటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కాగా కారేపల్లి తహసీల్దార్, ఇందిరా క్రాంతి పథక కార్యాలయాలలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాత తెలంగాణ తల్లిని కలిగి ఉన్న పోటోలను వాడడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేశారు.



వైరా స్వాతంత్ర్య వేడుకల్లో ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



చింతకానిలో...



మధిరలో...



కొణిజర్లలో...



వేంసూరులో...



ఏన్కూరులో....



కారేపల్లిలో....



తల్లాడలో....



ముదిగొండలో....



కల్లూరులో....



పెనుబల్లిలో....



సత్తుపల్లిలోని ఎన్టీఆర్‌నగర్ స్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం



వెంకటాపురం పాఠశాలలో స్వాతంత్ర్య ఉద్యమ జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

బోనకల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండలంలోని 19 గ్రామాలకు సంబంధించి పలువురు లబ్ధిదారులకు డిప్యూటీ సీఎం భట్టి చొరవతో మంజూరైన రూ. 30 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ మండల నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటీ రామకోటేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు పైడిపల్లి కిషోర్ కుమార్, గాలి దుర్గారావు, బీవీ నాయక్, తోటపల్లి స్వామి, మరీదు శ్రీనివాసరావు, అంతోటి వెంకటేశ్వర్లు, యార్లగడ్డ శ్రీను, అళ్ల నాగరాజు, రమేష్, భద్రునాయక్ పాల్గొన్నారు.

డైమండ్ జూబ్లీ ఉత్సవాలను పురస్కరించుకొని ర్యాలీ

వేంసూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వేంసూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రారంభమై 75సంవత్సరాలైన సందర్భంగా డైమండ్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించేందుకు పూర్వవిద్యార్థులు నిర్ణయించారు. ఈమేరకు శుక్రవారం పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. డైమండ్ జూబ్లీ ఉత్సవాలను త్వరలో నిర్వహించేందుకు పూర్వవిద్యార్థులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో తక్కెళ్లపాటి సూర్యనారాయణ, కలకొడిమ మధు, బింగి గాంధీబాబు, చింతా చెన్నారావు, పావులూరి సురేష్, ఎండీ.హుస్సేన్, ఎండీ.ఇమామ్‌పాషా పాల్గొన్నారు.

ప్రభుత్వ గెస్ట్‌హౌస్‌కు తాళం

▸ ప్రైవేటు పార్కింగ్ కథనానికి స్పందన



తాళం వేసిన ప్రభుత్వ గెస్ట్‌హౌస్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మధిర, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గెస్ట్ హౌస్ లో ప్రైవేటు పార్కింగ్ అంటూ ఆంధ్రజ్యోతి కథనానికి అధికారులు స్పందించి అందులో పార్క్ చేసిన వాహనాలను తొలగించి గెస్ట్‌హౌజ్ గేట్‌కు తాళం వేశారు. మధిరలో రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న రెవెన్యూ గెస్ట్‌హౌజ్‌ను ప్రైవేటు పార్కింగ్ మార్చిన వైనంపై ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి స్పందించిన అధికారులు అక్కడి నుంచి వాహనాలను తొలగించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనాన్ని తెలుసుకున్న డిప్యూటీ సీఎం భట్టి ఆంధ్రజ్యోతిని వివారాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన ఆదేశంతో అధికారులు వాహనాలను ఖాళీ చేయించి గెస్ట్‌హౌజ్ గేటుకు తాళం వేశారు. పార్కింగ్ పెట్టుకోమన్న కాంగ్రెస్ నాయకునికి భట్టి అక్షింతలు వేసినట్లు తెలుస్తుంది. అటు అధికారులను కూడా ఏమి చేస్తున్నారని నిలదీసినట్లు సమాచారం. దీనికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేయాలని తహసీల్దార్ రాంబాబును ఆదేశిస్తూ మధిర పట్టణంలో ఉన్న ప్రభుత్వ ఆస్తులన్నింటిని పరిరక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని అన్నారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అశోక్

ఏన్కూరు, ఆగస్టు15(ఆంధ్రజ్యోతి): ఏన్కూరుకు చెందిన శ్రీసాయి వేబ్రిడ్జి నిర్వాహకులు మాదినేని అశోక్ శుక్రవారం తన సొంత ఖర్చులతో ఎస్సీ కాలనీకి చెందిన వందమంది నిరుపేద వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా మాజీ ఉపసర్పంచ్ వేముల రమేష్‌బాబు వికలాంగుల కుటుంబాలకు క్వింటా బియ్యాన్ని అందించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిర్రా వెంకన్న, ఆర్ఎంపీలు కోపెల రామారావు, మాదినేని సాయి, కొంగర శ్రీను, పూర్ణకంటినాగరాజు, తాళ్లూరి వెంకటేశ్వర్లు, దుగ్గిరాల రమేష్, వసంత వెంకటేశ్వర్లు, దుగ్గిరాల వెంకటి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సిస్టం అందజేత



పాఠశాలకు మైక్‌సిస్టంను అందిస్తున్న రామకృష్ణ

సత్తుపల్లిరూరల్, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిష్టాపురం ప్రాథమికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థి ఎం.రామకృష్ణ రూ.18వేల విలువైన మైక్ సిస్టమ్‌ను శుక్రవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మనోహర్ మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తుంబూరు సొసైటీ అధ్యక్షుడు చిలుకుర్తి కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ముదిగొండ/తల్లాడ/కల్లూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల పదవీకాలం ఆరునెలలు పెంచిన సందర్భంగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్లెక్సీకి ముదిగొండ, గంగదేవిపాడు, చిన్నకోరుకొండి పీఏసీఎస్‌లలో ఆయా సొసైటీ చైర్మన్లు తుపాకుల యలగొండస్వామి, తూము వీరభద్రరావు, చావా వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయా కార్యక్రమాలలో సిబ్బంది పాల్గొన్నారు.

వర్షానికి నీట మునిగిన వరి పొలాలు



బోనకల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఏరుల్లా ప్రవహిస్తున్నాయి. వర్షానికి పంటలు నీట మునిగాయి. వరి పొలాల్లో చేరిన నీళ్ల చేరడంతో చెరువును తలపించే విధంగా ఉన్నాయి.

సత్తుపల్లి జిల్లా ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి కేంద్రంగా జిల్లా ఏర్పాటుకు తాను సంపూర్ణంగా కృషి చేస్తానని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమెను సత్తుపల్లి జిల్లా సాధన కమిటీ సభ్యులు కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాల మార్పులు-చేర్పుల వార్తా కథనాలను ఆమెతో ప్రస్తావించగా సానుకూలంగా స్పందించిన ఆమె స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకువెళ్లి వినతిపత్రం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అదేవిధంగా 2023శాసనసభ ఎన్నికల ప్రచారంలో భాగంగా లోక్‌సభ సభ్యురాలు ప్రియాంకగాంధీ ఇచ్చిన ప్రత్యేక జిల్లా ఏర్పాటు హామీని నెరవేర్చాలని వినతిపత్రంలో కోరారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న జిల్లా సాధన కమిటీ సభ్యులు

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఉద్యమకారులు గాదె చెన్నారావు, పింగలి సామేలు, దండు ఆదినారాయణ, మధుసూదనరాజు పాల్గొన్నారు.


కుప్పకూలిన గైడ్‌వాల్‌కు కాంట్రాక్టర్ బాధ్యత వహించాలి

వైరా, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ కుడి, ఎడమకాల్వల రెండో దశ ఆధునీకరణ పనుల్లో భాగంగా ఎడమకాల్వ లింగన్నపాలెం బ్రాంచ్ కెనాల్‌లో నాణ్యతాలోపంతోనే వందమీటర్ల సిమెంట్ గైడ్‌వాల్ కుప్పకూలిందని తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు ఆరోపించారు. శుక్రవారం తెలంగాణ రైతుసంఘ బృందం కూలిన గైడ్‌వాల్‌ను పరిశీలించింది. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ వైరా కాల్వల రెండో దశ ఆధునీకరణ పనులు కేవలం కంకర, సిమెంట్ కాంక్రీట్ చేయటం వల్లనే కూలిపోయిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పారుపల్లి కృష్ణారావు, తుమ్మల జాన్‌పాపయ్య, మాజీ ఉపసర్పంచ్ వీరపనేని చెన్నకేశరావు, బాణాల శ్రీనివాసరావు, మేడా శరాబందీ, రూ ద్రాక్షల వెంకటాచారి, వడ్లమూడి మధు, చావా వెంకటేశ్వరరావు, వెంకటనారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రైతుసంఘం నాయకులు

ఘనంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర జన్మదిన వేడుకలు



ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

కల్లూరు, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో శుక్రవారం బీఆర్ఎస్ శ్రేణులు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మెయిన్ సెంటర్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీలు కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘులు కేక్ కట్ చేసి మాజీ ఎమ్మెల్యే సండ్రకు బీఆర్ఎస్ శ్రేణుల తరఫున జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బాణాసంచ కాల్చారు. సీట్లు పంపిణీ చేసి సంబురాలు జరుపుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెడకంటి రామకృష్ణ, ఎల్ఎస్ సీఎస్ చైర్మన్ బోబోలు లక్ష్మణరావు, కళ్యాణపు కొండలరావు, దేవరపల్లి భాస్కరరావు పెద్దబోయిన మల్లేశ్వరరావు, గంగవరపు వెంకటేశ్వరరావు, కొరకొప్పు ప్రసాద్, ఉబ్బన వెంకటరత్నం, తదితరులున్నారు.

అందరికీ రుణాలు అందించాలి

బోనకల్, ఆగస్టు 15(ఆంధ్రజ్యోతి): సొసైటీ పరిధిలో భూములు ఉన్న వారందరికీ రుణాలు తీసుకునేందుకు అర్హులుగా పరిగణనలోకి తీసుకోవాలని సొసైటీ చైర్మన్ చావా వెంకటేశ్వరరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బోనకల్ సొసైటీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన పాలకవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యవర్గ సభ్యులు చావా వెంకటేశ్వరరావు, గుండపనేని సుధాకర్‌రావు, యార్లగడ్డ చిన్న నర్సింహ, నందమూరి సత్యనారాయణ, మోర్ల శ్రీను, గంగుల పుల్లయ్య, బిళ్ల విశ్వనాథం, భూక్యా సైదా, రాధమ్మ, మణెమ్మ, శ్రీనివాసరావు, నాగమణి, సీఈవో ఎం. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపర్చుకోవాలి

● సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

పెనుబల్లి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలుచేసేందుకు కృషిచేయాలని సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ సూచించారు. శుక్రవారం పెనుబల్లి రెవెన్యూ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూభూభారతి దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే క్రమంలో త్వరితగతిన పూర్తి చేయాలని ఇందుకోసం సిబ్బంది, గిర్దావర్‌లు ప్రణాళిక ప్రకారం పనిచేయాలని సూచించారు. మండలంలోని కర్రాలపాడులో కాల్వ విషయమై రైతుల మధ్య ఉన్న వివాదాన్ని పరిష్కరించాలని తహసీల్దార్ నారాయణమూర్తిని ఆదేశించారు. అనంతరం అధికారులతో కలిసి కర్రాలపాడులోని వివాదాస్పద భూమిని పరిశీలించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్

ప్రజాపాలనలోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు

▸ ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్

వైరా, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వంలోనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలుచేస్తున్నామని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం వైరాలోని తమ క్యాంపు కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు కేవీ.శ్రీనివాసరావు, నారపోగు అరుణ, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, నాయకులు సూరంపల్లి రామారావు, రామిశెట్టి రోశయ్య, బోళ్ల గంగారావు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన పూరిల్లు

వైరా, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి):గత నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని తాటిపూడి గ్రామంలో ఒక పూరి గుడిసె కూలిపోయింది. వర్షాలకు తడిసి గోడలు బీటలు వారి పడిపోయాయి. ఇంట్లో నివసిస్తున్న మీరాబీకి ప్రమాదం తప్పిపోయింది. కూలీపనులు చేసుకొని జీవిస్తున్న మీరాబీ గత 30ఏళ్ల నుంచి పూరిగుడిసెలో నివసిస్తుంది. పదేళ్ల కిందట భర్త అప్జల్‌మియా అనారోగ్యంతో మృతిచెందాడు. కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా, ఉన్నత చదువులు చదివిన కుమారుడు ఉద్యోగం లేక ఖాళీగా ఉంటున్నాడు. మీరాబీ వ్యవసాయ కూలీపనులు చేస్తూ కుటుంబాన్ని వెళ్లదీస్తోంది. వర్షాలు కురిసినప్పుడు ఇంట్లో ఉండలేని పరిస్థితుల్లో ఇంటి పైభాగంలో టార్పాలిన్ పట్టాలను వేసుకుంది. తమకు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని మండల, గ్రామ అధికారులు, నాయకుల చుట్టూ తిరిగినప్పటికీ ఆమె విషయంలో ఎవరూ కరుణ చూపించలేదు. తనకు అన్ని అర్హతలున్నప్పటికీ ఇందిరమ్మ ఇంటిని కేటాయించలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తుంది. ఇప్పటికైనా అధికారులు కనికరించి తనకు ఇళ్ల మంజూరు చేయాలని వేడుకుంటుంది.



వర్షాలకు కూలిన గోడలు

పాఠశాలల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

కల్లూరు/ఏన్కూరు, ఆగస్టు15 (ఆంధ్రజ్యోతి) కల్లూరులోని తెలంగాణ గ్రామర్ పాఠశాలలో శుక్రవారం ముందస్తుగా శ్రీకృష్ణ జన్మష్టమి వేడుకలను జరుపుకున్నారు. విద్యార్థులు కృష్ణుడు, గోపికా వేషధారణ పలువురిని ఆకట్టుకుంది. అదే విధంగా ఏన్కూరు మండలంలోని పలు పాఠశాలలలో శ్రీకృష్ణామి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. సంప్రదాయాల గురించి ఉపాధ్యాయులు వివరించారు. ఆయా కార్యక్రమాలలో తెలంగాణ పాఠశాల చైర్మన్ ఎస్‌కె జానీమియా, పాఠశాల ప్రిన్సిపాల్ యస్‌కె ఇస్మాయిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





కల్లూరు, ఏన్కూరులలో కృష్ణుడు, గోపికల వేషధారణలలో ఆకట్టుకున్న చిన్నారులు